కానుకలు అక్కర్లేదంటున్నారు. నాన్న అదే ఖాయం చేద్దామనుకుంటున్నారు' అంది.

'నిజం చెప్పు హేమా! ఆ సంబంధం నీకిష్టమేనా?' అన్నాడు సుదర్శనం.

'కట్నమిచ్చే తాహతు వుంటే యిష్టా యిష్టాలు. ఆ తాహతు లేకపోయినాక ఎక్కడికక్కడ సరిపెట్టుకోవడమే మంచిదేమో!' అంది

'ఇష్టంలేని పెళ్ళికి అంగీకరిస్తావా హేమా? అలా జరగడానికి వీల్లేదు. నేను చేసుకుంటాను. నేనంటే యిష్టమేనా?' అన్నాడు సుదర్శనం.

ఇష్టమో అయిష్టమో హేమ చెప్పలేదు.

"రండి! నాన్నగారితో కలిసి మాటాడి పెళ్ళి ఏర్పాటు చేద్దాం' అంది హేమ.

యువకిశోరం కొంచెం సందిగ్ధంలో పడ్డాడు. నీళ్ళునమిలాడు. 'మానాన్నతో మాట్లాడి ఆయన్ను ఈపెళ్ళికి వొప్పిస్తాను. నాకా విశ్వాసం వుంది. మీరు కొంచెం టయిమ్ ఇవ్వాలి' అన్నాడు.

అమ్మాయి తల అడ్డంగా వూపింది 'లాభంలేదు. ఈరోజు పోస్టుకి అవతలి వాళ్ళకు మా నిర్ణయం తెలియ చెయ్యాలి. మీరు స్వయంగా ఒక నిర్ణయానికి రాగలిగితే, సాయంత్రంలోపల నాన్నగారితో మాటాడండి' అంటూ హేమ వెళ్ళిపోయింది.

సుదర్శనం హతాశుడయ్యాడు. కాసేపు గదిలో అటూఇటూ పచార్లు చేశాడు. కాసేపు జుట్టు పీక్కున్నాడు. నాన్న ప్రమేయం లేకుండా పెళ్ళిచేసుకుందా మనుకున్నాడు. ఒకడుగు ముందుకు వేశాడు. హిరణ్యాక్షుడిలా సుదర్శనం నాన్న కళ్ళముందు మెదిలాడు. దాంతో కాళ్ళకు బ్రేకులు పడ్డాయి. కళ్ళకు నీళ్ళు వచ్చాయి. ఏం చెయ్యడానికి పాలుపోక 'నేను భగ్నప్రేమికుడిని' అనుకున్నాడు. భగ్నప్రేమకు చిహ్నంగా ఆ రాత్రి నిద్రమేలుకొని రెండాటలు చూచి తెల్లారి ఆ గది వదిలి మరొక గది వెతుక్కుంటూ బయలుదేరాడు.

---